# తులసిదళాలు

మార్కెట్‌కి సమీపంగా- హోటళ్ళకు దగ్గరగా- కొత్తగా కట్టిన సింధూలాల్ బిల్డింగ్సులో ఫ్లాట్లన్నీ అమ్ముడుపోయాయి. జీవన్‌లాల్ కిందఉన్న ఫ్లాట్ ఒకటి తనకొరకు ప్రత్యేకించుకున్నాడు. ఆధునిక సౌకర్యాలతో మూడు పడకగదుల ఫ్లాట్లు కడుతూ ఉండగానే డబ్బు చెల్లించారు కొందరు.

బిల్డింగ్ వెనక రెండువందల గజాల స్థలంలో పళ్ళచెట్లూ, వాటిమధ్యగా ఒక నీటికొలనూ, దానిమధ్యలో ఎత్తుగా పద్మము విచ్చుకోబోతున్నట్టుగా ఉన్న తులసికోటా ఉన్నాయి. కోటచుట్టూ ఆవరించుకున్న నీటికొలను– తెల్లకలవలు నీలికలవలు విచ్చినవీ విచ్చనివీ ఆకులమధ్య లేచి నిలబడినట్టుగా కన్నులపండుగ చేస్తూఉంటాయి. జీవన్‌లాల్ ఆ చెట్లకు స్వయంగా ఉదయం ఐదుగంటలకు నీళ్ల పోసి అక్కడే స్నానంచేస్తాడు. తులసికోటలో నీళ్లపోసి, నమస్కారం చేస్తాడు అన్నీ సరిచూసుకుని, గేటు తలుపుతాళంవేసి, తన ఫ్లాట్‌లోకి వస్తాడు.

సింధూలాల్ గురుకులమొకటి ఊరికి చివరగా మూడు ఎకరాల స్థలంలో నిర్మింపబడ్డది. దానిలో విద్యార్థులకు వసతిగృహము, పాఠశాల భవనము, పిల్లలకు ఆటస్థలమూ, చుట్టూ నీడనిచ్చే చెట్లతో నిండుగా చల్లగా ఉంటుంది. ఆ గురు కులము మంచిపేరు పొందిన వాటిలో ఒకటిగా అందరూ భావిస్తారు.

ఆరోజు వైకుంఠ ఏకాదశి. తులసిదళాలకోసం ఒకపిల్లవాడు జీవన్‌లాల్ ఇంటికి వచ్చాడు.

"మా తోటలో ఉన్నాయని ఎవరు చెప్పారు" అన్నాడు జీవన్‌లాల్.

"ఇక్కడ అందరికీ తెలుసండీ. ఇవాళ వైకుంఠ ఏకాదశి కదండీ. వేణు గోపాలస్వామికి తులసిదళాలతోనే అర్చన చేయాలటండి. గుడి ఆవరణంలో ఉన్న పెద్ద చెట్టుఎండిపోయింది. చిన్నచిన్న చెట్లు మొలిచాయి. ఇప్పుడిప్పుడే ఆకులు వస్తున్నాయి. ఎవరింటికిపోయినా వాళ్ళు ముందుగానే కోసుకున్నామని

ఉత్తచెట్లను చూపిస్తున్నారు. ఎక్కడినుంచో ఒకావిడ గుప్పెట్లో తులసిదళాలను తీసుకుపోతుంటే నేనడగంగానే నాలుగంటే నాలుగు దళాలు ఇచ్చిందండి. ఈ నాలుగూ మానాన్నకు తీసుకుపోయిఇస్తే "ఇవేం చాల్తాయి ? వైకుంఠ ఏకాదశినాడు వేణుగోపాలుడి పూజకు తులసిదళాలు ఇంకాకావాలి. జీవన్‌లాల్ గారింట్లో పెద్ద తులసిచెట్టుఉంది. అడిగి కోసుకురా" అన్నాడు. అందుకు వచ్చానండి.

"ఉన్నమాట నిజమేకాని—మేము తులసిదళాలను సాధారణంగా కొయ్యము. నీటికొలనుచుట్టూ కొన్నిచెట్లు మొలిచాయి. వాటిదళాలను కావాలంటే కోసిఇస్తాను" అన్నాడు.

"తులసికోటలో ఉన్నది కృష్ణతులసిచెట్టు పెద్దదిటకదా ? అందుకే మీదగ్గరికి పంపించారండి."

"నేను చూపించిన చెట్లుకూడా తులసిచెట్లే అవికూడా పూజలకు పనికి వస్తాయి. ఆ కోటలో ఉన్న చెట్టు చాలాఎత్తుగా ఉంది. చుట్టూఉన్న నీటికొలనులో కలువచెట్లున్నాయి. కనుక బురద బురదగా పాకుడుగా ఉంటుంది. నీవాకొలనులో నుంచి వెళ్ళి కోట ఎక్కలేవు. అదీకాక కోటమీద బురదకాళ్ళు పడకూడదు."

"కాదండి". మానాయన ఏంచెప్పాడంటే "కృష్ణతులసిదళాలతో పూజచేయ టానికి కావలసినవి కోసుకురా. ఆ దళాలంటే వేణుగోపాలుడికిష్టం. అవే అర్చ నకు ముఖ్యమైనవని."

"అవి కొయ్యటం నాకిష్టంలేదు. ఐదయినా పదయినా ఇవ్వలేను. అసలు అవి కొయ్యటానికి వీలయిన స్థలంలో లేవని చెప్పానుగా ?"

"ఎలాగయినా నేను ప్రయత్నించి కోస్తానండి. ఇవాళ వేణుగోపాలస్వామికి అర్చన చెయ్యకపోతే మానాయన భోజనం చెయ్యడు. కనుక దయచేసి ఆ చోటు చూపించండి" ఆ పిల్లవాడు పదేపదే అడుగుతున్నాడు.

జీవన్‌లాల్‌కి కోపం వచ్చింది. ఆ తులసికోట. ఆ నీటికొలను- అసలు అదేకాదు- ఆ తోటంటేనే అతడికి దైవసమానం. సాధారణంగా ఎవరినీ దానిలో అడుగు పెట్టనివ్వడు. సామాన్యంగా అతడికి కోపంరాదు. వచ్చినప్పటికీ పైకి కన బడనీయడు. ఎటువంటి పరిస్థితులలోనయినా చాలా సభ్యతతో మాట్లాడే అలవాటు.

"చోటు చూపించినా నీకందవని చెప్పానుగా ? నీవు కొయ్యలేవు" అన్నాడు.

"పూజాద్రవ్యాలకు- అందులో- వైకుంఠ ఏకాదశినాటి పూజకు- తులసిదళాలు ఉంచుకునికూడా ఇవ్వటానికి ఇంత సంకోచిస్తారెందుకండీ ? కొందరు ఈనాటి పూజకు అడిగినదే తడవుగా అదే భాగ్యంగా ఇస్తారు. ముందు నన్ను ఆ స్థలం చూడనీయండి. అవలీలగా కోస్తాను" అన్నాడు.

జీవన్‌లాల్‌కి ఇష్టంలేకపోయినా ఆ పిల్లవాడిని తోటలోకి తీసుకువెళ్లాడు.

"చూశావా ? తులసికోటచుట్టూ నీటికొలను ఉంది. అంతా బురదమయంగా ఉంటుంది. నీవు జారిపడే అవకాశముంది. తులసికోట ఎత్తుగా ఉందని చెప్పాను. నీ బురదకాళ్ళు తులసికోటమీద పడకూడదు. కోటకు దీపంపెట్టే గూడుఉంది. దానిలో కరెంటుదీపం ఎప్పుడూ వెలుగుతూ ఉంటుంది. ఆ తీగెలు నీకాలికి తగిలితే షాక్ తగలవచ్చు" అన్నాడు- అతడిని నిరుత్సాహపరుస్తూ.

"నాకేం భయంలేదండీ. నేను జాగ్రత్తగా వెళ్ళి తీగెలు తాకకుండా-బురద మరకలు కోటమీద పడకుండా- కోసుకుంటాను. మీరుచూస్తూ ఉండండి" అంటూ నీటికొలనులోకి దిగాడు. రెండుసార్లు కాలుజారినా నిలవదొక్కుకుని కోటను సమీపించాడు. కాళ్లు బాగా కడుక్కొని కావలసిన దళాలు ఒక తామరాకులో కోసుకుని వెనక్కు తిరిగిచూశాడు.

జీవన్‌లాల్ అతడిని కనిపెట్టి చూస్తునే ఉన్నాడు. "నీకు కావలసినన్ని కోసుకున్నావుకదా ? ఇంక దిగిరా" కేకపెట్టాడు.

"ఇప్పుడు కోసినవి అర్చనకు సరిపోతాయి. ఇవాళ పెద్దపూజ కదండీ. మా మామ్మ మంచానికి అంటుకుపోయి ఉంది. ఆమె తులసితీర్థం తాగి ఒకపూట భోజనం చేస్తుంది. ఇవి లభ్యంకానినాడు ఉపవాసం ఉంటుంది. మరికొన్ని కోసుకోనా ?" వేడుకుంటున్నట్టుగా ముఖం పెట్టాడు.

"అబ్బాయీ, నీవు చాలా కోసుకున్నావు, ఇంకా అడుగుతున్నావు. ఆచెట్టంతా ఇవాళే దూసేస్తావా ఏమిటి? ఆ చెట్టు నాప్రాణంతో సమానం. ఏమనుకున్నావో ?" పెద్దగా అరిచాడు.

"మీరు ఒకసారి మా మామ్మనుచూస్తే అట్లా మాట్లాడరు. కావాలంటే నాతో రండి ఆమెను చూపిస్తాను'' అంటూ తనకు కావలసినన్ని కోసుకుని, ఎట్లా జాగ్రత్తగా వెళ్ళాడో అట్లా మెల్లగా తిరిగివచ్చాడు.

ఆ పిల్లవాడి ధైర్యానికీ అతడి మాటలకూ జీవన్‌లాల్ ఆశ్చర్యపోయాడు. అయినా పైకి గంభీరంగా "తులసి తీర్థం పుచ్చుకునే మీ మామ్మను చూపిస్తావా ?" అడిగాడు.

"ఓ, నాతో కూడా రండి. ఆమె చాలా సంతోషిస్తుంది. మీరు తులసిదళాలు ఇచ్చారనగానే మిమ్మల్ని నెత్తిమీద పెట్టుకుంటుంది."

"నీ పేరేమిటన్నావు ?"

"మురళీకృష్ణ, మీరడిగితే అప్పుడే చెప్పేవాడిని."

అతడు ముందు నడుస్తుంటే జీవన్‌లాల్ అతడి వెంట నడిచాడు నవ్వుకుంటూ.

పక్క వీధిలో ఒకచిన్న వేణుగోపాలస్వామి దేవాలయం ఉంది. అక్కడికి కూడా భక్తులు వచ్చి అర్చనలు చేయించి కానుకలు వేస్తూ ఉంటారు పళ్ళెంలో. అదే అర్చకుడికి జీవనాధారం. దాని పక్కనే ఒక చిన్న పెంకుటింట్లో ఆయన తన తల్లితో ఈ పిల్లవాడిని పెట్టుకుని ఉంటున్నాడు.

జీవన్‌లాల్ అతడి ఇంటికి వెళ్ళాడు. పండు ముదుసలి మంచానికి అంటుకుపోయి ఉంది. మురళీకృష్ణను చూడగానే "తెచ్చావురా ?" అన్నది.

"తీసుకువచ్చాను. నాయన పూజకు కొన్ని దళాలు ఇచ్చాను. ఇంకా కొన్ని ఉన్నాయి. తామరాకులో పెట్టాను. నాయన రాగానే నీకు తీర్థమిస్తాడు. నేను తులసిదళాలను వీరింటినుంచే తీసుకు వచ్చాను. ఈ చుట్టుపక్కల ఎక్కడా దొరకలేదు. వీరు నిన్ను చూస్తానంటే వెంటపెట్టుకుని వచ్చాను" అన్నాడు జీవన్‌లాల్‌ని చూపిస్తూ.

"పెద్దలను నిలబెట్టావుట్రా ? జింకతోలు పరచి కూర్చోమని చెప్పు" అని లేచి కూర్చుని "బాబూ, మీరు చిన్నవారు. నమస్కరిస్తే ఆయుక్షీణం. పదికాలాలపాటు పిల్లా పాపలతో సుఖంగా జీవించండి'' అన్నది జీవన్‌లాల్‌ని చూసి.

జీవన్‌లాల్‌కి ఆమెను చూడగానే నోటివెంట మాట రాలేదు. చేతులెత్తి నమస్కరించాడు కూర్చుంటూ.

ఇంతలోకి తండ్రి వచ్చాడు. రాగానే జీవన్‌లాల్‌కి నమస్కరించి "మీరు

తులసిదళాలు ఇచ్చి వేణుగోపాలస్వామికి పూజచేయించారు. పైగా మా అమ్మను బ్రతికించారు. ఆమె తులసి తీర్థం తప్ప ఏకాదశినాడు వట్టి తీర్థం తీసుకోదు" అన్నాడు.

''దానిదేమున్నది ? ఒకటి దైవకార్యం. రెండవది దైవసమానులైన పెద్ద లకు జీవనాధారం". అతడికి ఇంకా మాట్లాడాలని ఉంది. కాని, ఏంలాభం? మాట పైకి రావటం లేదు. మనసు ఆందోళన చెందింది. తన అమ్మాజీని ఎవరితో పోల్చగలడు ? ఎవరితో పోల్చటానికీ చప్పున అతడి మనసు అంగీకరించదు.

"ఈ అబ్బాయి ఏం చదువుతున్నాడు ?" తన ఆందోళనను కప్పిపుచ్చు కుంటూ అడిగాడు.

"నేనే తీరిక ఉన్నప్పుడు నాలుగుముక్కలు చెబుతున్నాను. స్కూలుకు పంపాలంటే ఫీజులూ అదనపు ఖర్చులూ భరించలేను, పేదవాడిని. నాకు వచ్చిన విద్యనే నేర్పాలనుకుంటున్నాను" అన్నాడాయన.

''ఈ ఊరి శివార్లలో సింధూలాల్ గురుకులం ఉంది. అక్కడే ఉండి విద్యాభ్యాసం చేయవచ్చు. ఎప్పుడైనా ఇంటికి రావచ్చు. ప్రభుత్వపాఠశాల వంటి దొకటి, కాలేజి ఒకటి, కాక, వేదపాఠశాల కూడా ఉంది. ఆగమశాస్త్రాలు బోధించ టానికి గురువులు ఉన్నారు. దానిలో చేర్పిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది పిల్ల వాడికి."

"బాబుగారూ నేను పేదవాడినని ముందే మనవిచేసుకున్నాను కదా ?"

''సింధూలాల్ గురుకులంలో గొప్ప బీదా అనే తేడాలులేవు వర్ణ వర్గ భేదాలు లేవు. మతభేదా లంతకంటే లేవు. కాని- అక్కడ నియమాలు మాత్రం కఠినంగా ఉంటాయి. అందరూ విధిగా పాటించాలి. చదువు ఉచితం. అన్నవస్త్రాలు లభిస్తాయి. నేను ఉత్తరం రాసియిస్తాను, మీరు పిల్లవాడిని చేర్పించండి. చురుకైన పిల్లవాడు. వృద్ధిలోకి వస్తాడు."

''అయ్యా, మీదయ. వాడి అదృష్టం వల్ల మీకంట పడ్డాడు. మా తల్లిని నేనో వాడో ఎప్పుడూ కనిపెట్టుకుని ఉండాలి ఆమెను వదలిపెట్టి అంతదూరం వెళ్ళలేను. నన్ను క్షమించి మీరు వెళ్ళినప్పుడు తీసుకువెళ్ళి చేర్పించండి"అన్నాడు చేతులు జోడించి.

అలా చేరిపోయాడు మురళీకృష్ణ గురుకులంలో. రాత్రింబవళ్ళు కష్టపడుతున్నాడు, వచ్చేసంవత్సరం నాలుగవ తరగతిలో చేరటానికి.

జీవన్‌లాల్ ఎం. ఏ. ఎకనామిక్సు చదివాడు ప్రస్తుతం సచివాలయంలో అసిస్టెంటు సెక్రెటరీగా పనిచేస్తున్నాడు. సాయంత్రపు వేళల్లో ఆఫీసునుంచి వస్తూ గురుకులానికి వెళ్ళి పర్యవేక్షిస్తాడు. అతడు ఇంటికి వచ్చేసరికి ఏడుగంటలు దాటుతుంది. అతడి కొడుకు చిన్న చగన్‌లాల్ తొమ్మిదేళ్ళవాడు. గురుకులంలోనే ఉంటాడు.

జీవన్‌లాల్ ఇంట్లో ఉన్నప్పుడు సాయంత్రం ఆరుగంటలు కాగానే తోటలోకి వెళ్ళి, సిమెంటు బెంచీమీద కూర్చుని తులసికోటవైపు చూస్తూ చేతులుజోడించి 'అమ్మాజీ!' అంటాడు గద్గద స్వరంతో. ఒక్కోరోజు తులసికోటను కౌగలించుకుని 'అమ్మాజీ' అంటూ కన్నీరు కారుస్తాడు. తోటలో ఉన్న కొబ్బరి చెట్లను చేతులతో చుట్టివేస్తూ "జోగయ్యా, అమ్మాజీని రక్షించబోయి నీవు కూడా చెట్టుగా మారిపోయి, గురుకులానికి కాయలందిస్తున్నావా ? నీ మనసు బంగారం. నీకు ఇంకా బంగారం ఎందుకనుకున్నావు కదూ? రోజూ పిడకలలోనుంచి తొంగిచూసే ఒక మొహరీనైనా చేతితో తాకకుండా కాపాడావు. మీ యిద్దరి గుణాలు భావిపౌరులకు నేర్పటానికే ఆ గురుకులం స్థాపనచేశాను. కఠినమైన నియమాలు పెట్టాను. కాలం మీనాటిదికాదు జోగయ్యా, అందుకే అట్లా పెట్టాను. ఈ చెట్లఫలాలన్నీ అక్కడికే పంపుతాను. వీటన్నిటినీ తిని పిల్లలు మిమ్మల్ని తలుచుకుంటూ మీ మాదిరిగా మంచి నడవడి నేర్చుకోవాలని" అనుకుంటాడు.

జీవన్‌లాల్ ఆదివారం ఉదయంపూట మురళీకృష్ణ మామ్మను చూడాలని పించి బయలుదేరి కొంతదూరం నడిచి వెనక్కు తిరిగాడు. తిన్నగా తోటలోకి వెళ్ళి గుప్పెడు తులసిదళాలను కోసి తామరాకులో చుట్టి తీసుకువెళ్ళాడు. తలుపు చప్పుడు కాగానే 'ఎవరది?' ప్రశ్నించింది- ఆమె.

తులసిదళాల పొట్లము ఆమె చేతికిస్తూ "మురళీకృష్ణ ఇక్కడలేడని నేనే తెచ్చాను మామ్మగారూ!" అన్నాడు.

ఆమెకు చెవులూ కళ్లూ బాగా పనిచేస్తున్నాయి.

"ఓ! మీరే స్వయంగా తెచ్చారా? ఎదురుగా బల్లఉంది, కూర్చోండి- మా అబ్బాయి పెరట్లో స్నానం చేస్తున్నాడు, ఇప్పుడే వస్తాడు."

ఆమెను మొదటిసారి చూసినప్పటినుంచీ జీవన్‌లాల్‌కి మళ్ళీ ఆమెను చూడాలనీ, ఆమెతో మాట్లాడాలనీ మనసు గిజగిజలాడిపోతున్నది. మొదటిచూపులోనే ఆమెపట్ల గౌరవాభిమానాలేకాదు. ఒక విధమైన ఆప్యాయత ఏర్పడ్డది. అమ్మాజీ పోయినప్పటినుంచీ దానికోసం అతడిమనసు గిలగిలకొట్టుకుంటున్నది. అందుకే బయలుదేరాడు. ఆ పలకరింపుకు-ఆ పలుకులోని ఆప్యాయతకూ అతడి మనసు తహతహలాడి పోతున్నది.

ప్రతి ఆదివారం ఉదయపువేళ స్నానంచేసి తులసిదళాల పొట్లం తీసుకుని బయలుదేరడం అతడికి అలవాటుగా మారింది.

మాటలసందర్భంలో ఆమె ఒకనాడు - "గురుకులంలో ఒక పెద్దఫొటో హాల్లో ఉన్నదట. ప్రతిరోజు ఉదయం ఎనిమిదిగంటలకు ఆ ఫొటోకి పూలహారం వేసి ప్రార్థనలు చేస్తారట. ఆ గురుకుల మెవరు స్థాపించారు? చిన్నవారయినా 'నీవు' అని అనలేకుండా ఉన్నాను బాబు?" అన్నది.

కొంతసేపు మాట్లాడలేకపోయాడు జీవన్‌లాల్ అతడికళ్లు నీళ్ళతోనిండాయి. మాట పెదవిదాటలేకపోయింది.

"ఏం మాట్లాడవు? నాతో చెప్పకూడని విషయమా?" తిరిగి ప్రశ్నించింది.

"మీరు - మీరు మా అమ్మాజీలా ఆప్యాయంగా పలకరించి మాట్లాడుతున్నారు. మీ దగ్గర దాపరికమా? దాని చరిత్రను తలుచుకుంటేనే నాగుండె నీరయిపోతుంది అందుకని-అందుకని - మనసు మూగబోయింది. రేపు మనసు దిటవుపరచుకొని చెప్తానమ్మా" తలవంచుకుని వెళ్ళిపోయాడు.

మరునాడు తులసిదళాలపొట్లము ఆమె ముందుంచాడు-పాదాలకు నమస్కరిస్తూ.

"నాయనా ఆఫీసుకు వెళ్ళలేదూ?" ప్రశ్నించిందామె.

"వెళ్ళలేదు సెలవు పెట్టాను గురుకులాన్ని గురించి అడిగారుకదా చెప్పాలనే వచ్చాను" అంటూ జీవన్‌లాల్ తలవంచుకుని చెప్పటం మొదలు పెట్టాడు.

మార్వాడీ సేట్ జీవన్‌లాల్ ఒక పెద్ద పారిశ్రామికవేత్త. రెండు బట్టల మిల్లుల యజమాని. అదికాక విదేశీసరుకు పంపిణీదారు. అతడి నలుగురుకొడుకులూ

పెద్దవాళ్లు కాకముందే భార్య చనిపోయింది. వ్యాపార రహస్యాలూ వాటిలోని మెలకువలూ తెలుసుగాని, అతడికి కుటుంబాన్ని ఎట్లా చక్కబెట్టుకోవాలో తెలియలేదు. కొంతకాలం నౌకర్లను పెట్టిచూశాడు. తృప్తికలగలేదు. ఆ తరువాత పెద్దకొడుక్కు అయినింటిపిల్లను చూసి పెళ్ళిచేశాడు. ఆమె వయసుకు చిన్నదయినా బాధ్యతతో ఇల్లు తీర్చిదిద్దేది మామగారిని తండ్రిలా కనిపెట్టి చూసేది. మరుదులను తమ్ముళ్ళ మాదిరిగాచూస్తూ దగ్గరుండి భోజనాలుపెట్టేది. ఆఖరిమరిది చగన్‌లాల్ ఆమె వచ్చేటప్పటికి ఆరేళ్ళవాడే. తన స్వంతబిడ్డను పెంచినట్టుగా పెంచింది. ఇంటి నౌకర్లుకూడా ఆమెనెంతో గౌరవించి తల్లిలా చూసుకునేవారు. ఆ యింటికామె ఒక మహారాణిలా ఉండేది.

కాలమెప్పుడూ ఒక్కరీతిగా ఉండదన్నట్టు ఆ యింటి పెద్దకొడుకు విషజ్వరంతో కన్నుమూశాడు. సేట్ జీవన్‌లాల్‌కి కుడిభుజం పడిపోయినట్లయింది. పెద్ద కోడలు సింధూబాయి తనదుఃఖాన్ని దిగమ్రింగుకుని మామగారిని ఓదారుస్తూ ఆయన దృష్టిని వ్యాపారంవైపుకు మళ్ళిస్తూఉండేది. కొడుకులకు పెళ్ళిళ్లు చేయమని చెప్తూఉండేది.

"వాళ్ళింకా చిన్నవాళ్లేకదా?" అనేవాడు.

"మీకంటికి చిన్నవాళ్లమాదిరిగా కనిపిస్తున్నారు. కాని పెళ్ళీడువచ్చింది. రెండు పెళ్ళిళ్లు ఒకసారి జరిపించండి" అని 'పిల్లలను చూడమ'ని బంధువులిద్దరికీ చెప్పేది. జీవన్‌లాల్ కొడుకులిద్దరినీ వ్యాపారాన్ని చూస్తూఉండమనేవాడు....వాళ్లూ క్రమంగా వ్యాపారసరళినంతా ఆకళింపుచేసుకున్న తరువాత, పెళ్ళిళ్లచేశాడు. తను ఆఫీసులోకూర్చుని కాగితాలుచూస్తూ ఉండేవాడు. కొడుకులకు సలహాలిస్తూ ఉండేవాడు.

అందరికంటె చిన్నవాడైన చగన్‌లాల్‌కి వ్యాపారంపట్ల అభిరుచిలేదు. స్కూలు చదువైన తరువాత కాలేజిలో ప్రవేశించాడు. తండ్రికిష్టములేకపోయినా అతడిని బలవంతంచెయ్యలేదు అతనికికూడా వివాహంచేశాడు. చగన్‌లాల్ పట్టభద్రుడై ఒక ప్రైవేటు కళాశాలలో ఉద్యోగం సంపాదించాడు.

సింధూబాయి ఇంటి వ్యవహారాలుచూస్తూ మామగారిని ఎక్కువగా శ్రమపడ నిచ్చేదికాదు.

సింధూబాయి ఇంటిపెత్తనంచేయటం ఆమె తోటి కోడళ్ళకు నచ్చలేదు.

నౌకర్లు ఆమెను మన్నిస్తూ పనులుచేయటం వాళ్ళ కంటికి కారంరాచినట్లయింది. సింధూబాయి ఒక్కొక్కపని తగ్గించుకుంటూ మామగారిని మాత్రం ఏమారేది కాదు. ఒకనాడు రాత్రి పడుకున్న జీవన్‌లాల్ గుండెపోటుతో మరణించాడు.

సింధూబాయికి ప్రపంచం తలక్రిందులయినట్లయింది. ఆమె వారంరోజులు పడుకున్న మనిషి లేవకుండా ఏడ్చింది.

ఇంక తనకేం మిగిలింది ఆ యింట్లో?

చేసుకున్న భర్త గతించాడు. బిడ్డలా లేరు. తండ్రిలా చూసుకునే మామ గారు కన్నుమూశారు.

తను ఈ ప్రపంచంలో ఏకాకి.

తన జీవిత ధ్యేయమేమిటి?

ఒకరోజు తినీ ఒకరోజు తినకా గదిలో పడుకుని తనలో తాను కుమిలి పోయేది. తనది గమ్యంలేని జీవిత మయింది.

ఒకనాడు అన్నదమ్ము లందరూ భాగాలు పంచుకున్నట్టు నౌకరుచెప్పగా విన్నది. ఆమె పెనిమిటి భాగంగా గొడ్లసావడి దానిలోఉండే నాలుగు ఆవులు పంచియిచ్చారని, తెలుసుకున్నది. ఆ మరునాడే ఆమె గొడ్లసావడిలోకి కట్టుబట్ట లతో తరలించబడ్డది.

ఆమె అందుకు ఏమాత్రం విచారించలేదు.

ఆమె నగలు ఇనప్పెట్టెలో చిక్కుకుపోయినందుకూ బాధపడలేదు. ఆ మూగ జీవాలను నాలుగింటినీ చూసుకుంటూ పాకలో ఒక పక్కగా పడుకునేది. వాటి పాలుతీసి తానుపయోగించుకోగా మిగిలినవి ఏంచేయాలి?

ఇరుగు పొరుగులు డబ్బిచ్చి తీసుకుంటామన్నారు.

అలా పాలు పెరుగు, వెన్న, నెయ్యి, అమ్ముతూ ఒక నెల కాగానే రెండు చీరెలు కొనుక్కున్నది. పెరడుబాగుచేసి గోడవారగా మట్టితో ఒక చిన్నగది మాదిరిగా కట్టుకుని దానిపైన గడకర్రలువేసి గడ్డితో కప్పుకున్నది.

ఒక్కొక్క నెల గడుస్తున్నకొద్దీ గొడ్లనుగురించిన వివరాలు గ్రహించింది.

గడ్డి కాకుండా వాటికి పుష్టికరమైన ఆహారం పెడితే బాగా పాలుఇస్తాయని గొడ్లను కాసేవాడిద్వారా తెలుసుకుంది. అప్పటినుంచీ అవి ఒక్కొక్కటి ఆరేసి లీటర్లపాలు పూటకు ఇచ్చేవి. అవి ఇచ్చే పాలు, పెరుగూవంటివి అమ్మితేగాని వాటి కడుపులు నింపలేదు.

సింధూబాయి ఆ ఒక్క గదిలోనే ఉట్లుకట్టి భద్రపరచి పాలు పెరుగు వెన్న నెయ్యికూడా అమ్ముతూ వాటిని పోషించేది. జీవితం యాంత్రికంగాఉన్నా ఆ గొడ్లను, దూడలనూ చూసుకుని మురిసిపోయేది. వాటిని కన్నబిడ్డల్లా కాపాడేది.

ఒకరోజు రాత్రివేళ ఎవరో తలుపుకొట్టినట్లయింది. తలుపు తీయగానే చగన్‌లాల్ బట్టలలో చుట్టబెట్టిన పసిబిడ్డను ఆమె చేతుల్లో పెట్టి "అమ్మాజీ వీడు పుడుతూనే తల్లిలేని వాడయినాడు. నన్ను పెంచినట్టే వీడినికూడా పెంచి పెద్ద వాడిని చెయ్యండి. నేను వ్యాపారం చేయటంలేదు కనుక దానిలో నాకు భాగం లేదుట. ఇంట్లోభాగం ఎంతఇస్తారో తెలియదు. ఏదయినాఇస్తే వీడికోసం తీసు కోండి" అన్నాడు.

"చగన్ ఇదంతా ఎప్పుడు జరిగింది? ఈ పసిపాప తల్లిలేనివాడా? నేను తీసుకోవటమేమిటి? నీవు ఎక్కడికివెళ్లుతున్నావు?" ఆమె అతడిమాటలకు ఆశ్చర్య పోతూ బిడ్డను గుండెకు హత్తుకుంది.

"అమ్మాజీ, జరిగినదంతా చెప్పలేను. 'ఆయింటి బంధాలను ఎప్పుడు తెంచు కుని బయటపడదామా' అని అనుకుంటూ ఉండగానే ఈ పని జరిగింది. ఈ పసి కూన మీ బిడ్డే అనుకోండి" గబగబా వెళ్ళిపోయాడు.

"చగన్ చగన్"అంటూ ఆమె పిలుస్తునేఉంది కాని అతడు తలుపు మూసు కుని వెళ్ళిపోయాడు.

సింధూబాయి జీవితంలో మరొక అధ్యాయం ప్రారంభమయింది. ఆ గొడ్ల పాకలోనే పసివాడిని పెంచింది. వాడికోసం మరొకటి అటువంటిగదే కట్టింది. గొడ్లు పిల్లవాడిగదిలోకి రాకుండా గడలతో అడ్డంకట్టింది. గొడ్లను తోలుకుపోయి మేపటానికి ఒక మనిషినిపెట్టింది వాడు పేడంతా కుప్పచేసి దూడలకు మేతవేసి గొడ్లను తోలుకుపోయేవాడు. పిల్లవాడు పడుకున్నప్పుడు సింధూబాయి పిడకలు చేసి తనున్నగదిలో గోడకు కొట్టేది.

ఆమె తనలో తాను 'మామగారు ఆ ఊరిలోకల్లా పెద్ద పారిశ్రామిక వేత్త. ఆయన మనమడు చిన్న జీవన్‌లాల్ గొడ్లసావడిలో పెరగటమా?" మనసు గిల గిల కొట్టుకునేది.

చూస్తూఉండగానే పసివాడికి ఐదవఏడువచ్చింది. దేవాలయానికి తీసుకు వెళ్ళి జీవన్‌లాల్ అని పేరుపెట్టి అక్కడే ఉన్న పాఠశాలలో చేర్పించింది.

ఒకనాడు గొడ్లతోపాటు కొత్తమనిషొకడు లోపలికి ఆమెకుఎదురుగానిలబడి "దణ్ణాలమ్మగారూ" అన్నాడు.

"ఎవరునాయనా నీవు?" అంటూ సందేహంగా అతడి ముఖంలోకి చూసింది.

"నేనమ్మా తోటమాలిని. గుర్తుకువచ్చానా అమ్మా?"

"నీవా జోగయ్య పెద్దవాడివయ్యావు. చప్పున గుర్తుపట్టలేకపోయాను"

"అమ్మగారూ, మీరిక్కడున్నారా? ఊరికెళ్ళిపోయారనుకున్నాను?"

"ఎందుకు వెళ్తాను? పెద్దయ్యగారు లేకపోయినా ఆయన ఇల్లు వదిలిపెట్టి వెళ్తానా? పరిస్థితులు మారాయిగాని మనసుమారలేదు. ఇదిగో ఇప్పుడే స్కూలు నుంచి వచ్చాడు చగన్‌లాల్‌జీ కొడుకు. పుట్టిన రెండుగంటలకు నాచేతుల్లోపెట్టి వెళ్ళాడు తండ్రి. జీవన్‌లాల్ అని తాతగారి పేరు పెట్టాను. చదివిస్తున్నాను. ఆ మూలకు గొడ్లు-ఈ మూలన మేమూ ఉంటున్నాము. ఆ గొడ్లే మమ్మల్ని పోషిస్తున్నాయి" కళ్ళనీళ్లు రాలకుండా నిబ్బరంగా చెప్పింది.

"అమ్మా, నేనూ ఇక్కడే ఉండిపోతాను. చిన్నసేట్‌ను బడికితీసుకుపోతాను ఇదంతాఊడ్చి బాగుచేస్తాను గొడ్లకుమేతవేసి నీళ్లుపెడతాను."

"నీకేమయింది మాతో ఉండటానికి? మేము అనాథలం కనుక ఇక్కడ ఉంటున్నాము."

"నా కెవరున్నారమ్మా, నాకూ ఎవరూలేరు. సేట్‌జీలు పనిలోనుంచితీశారు నేనెక్కడికి పోతానమ్మా! మీరే తల్లనుకుని గొడ్లతోపాటు లోనికివచ్చానమ్మా."

"రా నీవుకూడా అనాథనంటున్నావుగా? ఇక్కడ ఎంతమందికయినా చోటుంటుంది. మాతోపాటే పాకలోఉండు. బిడ్డను పెంచినట్టే గొడ్లను పెంచు

తున్నాను అవికూడా నన్ను అభిమానిస్తున్నాయి. నేను వెళ్ళి ఒళ్లంతానిమిరేవరకూ అరుస్తునే ఉంటాయి. నేను వస్తేనేపాలిస్తాయి. మేము తినేదే నీకింత పెడతాను ఉండు" అన్నది విశాల హృదయంతో.

జోగయ్య వచ్చినప్పటినుంచీ ఊరికే ఉండలేదు. సింధూబాయికీ జీవన్ లాల్ కీ రెండు గదులు పెద్దవి మట్టితోకట్టి గడ్డికప్పాడు. గొడ్లదగ్గరగా తానొక పాకవేసుకున్నాడు. వాటిని మచ్చికచేసుకుని మేతవేసి నీళ్లు పెడుతున్నాడు. వాటిని బైటికితీసుకుపోయి కడిగి తీసుకువస్తున్నాడు. పెరడంతా పిచ్చిమొక్కలూ గడ్డీ లేకుండాచెక్కి నున్నగాచేశాడు.

జీవన్‌లాల్ చాలాచురుకైనవాడు. సింధూబాయిని అమ్మాజీఅని పిలిచేవాడు. ఒక్కొక్కక్లాసు దాటుతూ పైకివస్తున్నాడు. అతడి చదువుకోసం జోగయ్య ప్రత్యేకంగా గోడలుకట్టి వాసాలమీద చెక్కలువేసి పెద్దగది తయారుచేశాడు. దానిలో అతడి చదువుకూ పడకకూ ఏర్పాటుచేశాడు.

ఒకనాడు జీవన్‌లాల్ "అమ్మాజీ నేను స్కూలుఫైనలు ప్యాసయ్యాను. ఇంక కాలేజిలో చేర్తాను" అన్నాడు.

"ప్యాసయ్యావా? ఎంతమంచి వార్తచెప్పావు? ఏదీ నోరుతెరు" అంటూ పాల కోవాతో చేసిన మిఠాయి నోట్లోపెట్టింది.

అతడు కాలేజిలో చేరినరోజున గుడికిపంపించి దేవుడి తీర్థప్రసాదాలు ఇప్పించి మరీ పంపించింది.

సింధూబాయి దినచర్య గడియారంతో పోటీపడేది. ఆమె చల్లటివేళ పిడకలుచేసి ఆ చిన్నచిన్న గదులనిండాకొట్టేది. అవి ఎండిపోయినతరువాత ఊడదీసి గోడవారగా గోపురంగాపేర్చి పైన మట్టితో పూతపూసేది. అవి తడిసిపోకుండా గడ్డికప్పేది ఈ విధంగా నాలుగు పిడకలగూళ్లు తయారుచేసింది. పిడకలు తీసిన చోట మళ్ళీ పిడకలు కొట్టేది.

"ఈ పిడకలే జీవన్‌లాల్‌కి రక్ష" అనుకునేది.

గోడకుకొట్టిన పిడకలలోనుంచి చిల్లులుచేసుకుని చెదలు బైటికి వస్తుండగా జోగయ్యచూశాడు. పిడకను ఊడదీసిచూస్తే దానిలో మొహారీలు కనబడ్డాయి. మళ్లీ వాటిమీద ఇంత మట్టిమెత్తి జాగత్తగా కాపాడుతూ ఉండేవాడు.

జీవన్‌లాల్ పెరుగుతున్నకొద్దీ తాతమాదిరిగా ఒడ్డూ పొడుగూ-మాటా మర్యాద ఆదరణ అలవడ్డది. కళాశాలలోచేరి మంచిపేరు తెచ్చుకుని ఉత్తమశ్రేణిలో ఎం.ఏ. ప్యాసయ్యాడు. అటుతరువాత డాక్టరేటు తెచ్చుకున్నాడు.

ఆ రోజు జీవన్‌లాల్ సంతోషంకొద్దీ ఈలవేసుకుంటూ తనకు ఉద్యోగం వచ్చిందన్నవార్త అమ్మాజీతో చెప్పాలని కాలేజినుంచి బయలుదేరాడు.

గొడ్లకోసంవేసిన రేకులషెడ్డుకు పక్కగా పెద్దగడ్డివాముంది. దానిమీద బట్టలారవేసుకునేది సింధూబాయి. ఎండినబట్టలు తీసుకోవటానికి వెళ్లిందా సమయంలో.

అంతలో గొడ్లను తరుముకుంటూ ఆంబోతు రంకెలు వేసుకుంటూ వాటి వెంట గొడ్లశాలలో జొరబడ్డది. తోక పైకెత్తుకుని అదివేసే రంకెలకు గొడ్లు భయపడి ఇటూఅటూ పరుగెత్తటం మొదలుపెట్టాయి. వాటిమధ్య ఇరుక్కుపోయిన సింధూబాయి అంబోతును పుల్లతో కొట్టబోయింది. అది కొమ్ములతో ఆమెను పైకెత్తి ఒకరాళ్ళకుప్పమీదికి తోసింది.

ఆంబోతును చూసి గొడ్లు బెదిరిపోయి ఇటూ అటూ పరుగులు పెట్టటం మొదలుపెట్టాయి.

జోగయ్య ఆరోజున గొడ్లకు చొప్ప తీసుకురావటానికి వెళ్లినవాడు తొంద రగా వచ్చాడు. వాడు ఆంబోతును అదిలించబోతే అది తలతో ఒక్క విసురు విసిరింది. అతడు రాళ్ళమీదపడి దొర్లుకుంటూ కిందపడ్డాడు.

ఆంబోతును చూసిన ఆవులు బెదిరిపోయి ఇటూ అటూ పరుగులుతీస్తూ సింధూబాయి జోగయ్యలమీద అడుగులువేస్తూ గొడ్లసావడి అంతా తిరుగుతున్నాయి భయంతో.

సింధూబాయి జోగయ్యలు పడిన రాళ్లగుట్ట కొండరాళ్ళది. అవి కొసలు దేరి ఉన్నాయి. బోర్లాపడిన సింధూబాయి ఛాతిలో దిగబడ్డాయి కొన్ని కడుపులో దిగబడ్డాయి. రక్తం వరదలుగా పారుతున్నది. జోగయ్య తల ఇంచుమించుగా పగిలి చాలా రక్తంపోయింది.

కొండంత సంతోషంతో అడుగు పెట్టిన జీవన్‌లాల్ ఆ దృశ్యంచూసి అదిరి పొయ్యాడు. అప్పటికి అంబోతు వెళ్ళిపోయింది. గొడ్లు బెదురుపోయి వాటి స్థానాలకు చేరుకున్నాయి.

ఇరుగుపొరుగుల సహాయంతో ఆ యిద్దరినీ హాస్పిటల్లో చేర్పించాడు జీవన్‌లాల్. రాత్రింబగళ్ళు అక్కడే కనిపెట్టుకుని ఉన్నాడు. కాని- వాళ్ళను సజీవంగా ఇంటికి తీసుకురాలేకపోయాడు.

సిందూబాయి జీవితఘట్టాలనూ ఒడిదుడుకులనూ జోగయ్య జీవన్‌లాల్‌తో చెప్తూ ఉండేవాడు. ఇంకా ఏమేమి విశేషాలు ఉండేవో ఇప్పుడు చెప్పటానికి ఎవరూలేరు.

అమ్మాజీ అంటూ పెరడంతా తిప్పించి అన్నంతిన్నరోజులూ, వెన్నతిన్న నోటితో ఆమె మెడ కౌగలించుకుని వెన్నంతా పట్టించిన రోజులూ, రాత్రిళ్ళు కథలు చెప్పమన్న రోజులూ అవీ ఇప్పటికీ జ్ఞాపకానికి వస్తున్నాయి. ఎంత అల్లరి చేసినా కోపగించి ఎరుగదు. అతడి కళ్లల్లోకి చూసేది. దానికే అతడు బెదిరిపోయి చప్పున ఆమె ఒళ్ళో దూరిపోయేవాడు.

"కోపం వచ్చిందా?" అంటూ ముద్దులు కురిపించేవాడు. ఆమెకు కోపమంతాపోయి మురిపెంతో ఒళ్ళో కూర్చోబెట్టుకునేది. ఆ విధంగా పాలమీగడలతో పెంచి జీవన్‌లాల్‌ను సహృదయుడిగా పరిపూర్ణ పురుషుడిగా తీర్చిదిద్దింది.

ఆ జోగయ్య తమదగ్గరికి ఎందుకు వచ్చాడు?

జీవన్‌లాల్‌ను ఎత్తుకుని తిరగటానికీ అతడికి సేవచేయటానికా?

అమ్మాజీది విశాలహృదయం. ఆమెకు తోడుగా గొడ్లను కాపాడుతూ చిన్న సేట్‌జీని ఆడించటానికి వచ్చాడు.

ఆమెకు తోడుగా వచ్చినందుకు ఆమెతోకూడా వెళ్ళిపోయాడు మూడు రోజుల మూగబాధ ననుభవించి.

అప్పటివరకూ జీవన్‌లాల్‌కి తల్లీదండ్రీ సర్వస్వమూ ఆమే-సిందూబాయి.

ఇప్పుడతడికి ప్రపంచమంతా చీకట్లు కమ్మినట్లయింది. లోకమంతా శూన్యంగా ఉంది.

తనేమయినా సింధూబాయి కడుపున పుట్టాడా వెలలేని మమతానురాగాలు అందుకోవటానికి ? కాని కడుపున పుట్టిన బిడ్డకంటె ఎక్కువగా అందుకున్నాడు.

తనకోసం- తల్లిదండ్రులులేని తనకోసం. తన భవిష్యత్తును మెరుగు పరచాలనుకుని పాలవ్యాపారంచేసి, పిడకలతో మొహరీలను భద్రపరచింది- కన్నతల్లికంటె మిన్నగా.

అమ్మాజీ జోగయ్య తల్లిదండ్రులను కంటితోచూసి ఎరుగని తనను కంటికి రెప్పలా కాపాడటానికి వచ్చిన దేవతామూర్తులు కాదు. అంతకంటె అధికులే.

వారం గడవకముందే తన కడపున పిల్లవాడుదయించాడు.

ఇదేనా లోకమంటే ? దుఃఖోపశయనం చేయటానికేనా ఈ నూతనసృష్టి?

అమ్మాజీ తన కందించిన మాతృప్రేమ పొంగిపొరలుతూ ఉంటే జన్మ జన్మలకయినా తాను ఆమె ఋణం తీర్చుకోగలడా ? జన్మజన్మలకూ ఆమెను మరువగలడా ?

ఆ మాతృమూర్తి తనకోసం భద్రపరచిన మొహరీలతోనే సింధూలాల్ గురుకులాన్ని స్థాపించి ట్రస్టుబోర్డును ఏర్పరచాడు.

ఆ తులసికోటలోనే అమ్మాజీని చూసుకుంటాడు.

దానిని తెల్లవారగానేచూసి కళ్ళకద్దుకుంటాడు.

సింధూలాల్ గురుకులం చరిత్ర విన్న మామ్మ "బాబూ ఆ తులసి దళాలతో ప్రాణం నిలుపుకుంటున్న నేనూ ఆమెకు ఋణపడి ఉన్నాను. పైగా నీవు నాకు గోదానంకూడా చేశావు. ఆమె గుణాలను నీవు పుణికిపుచ్చుకున్నట్టున్నావు. ఆమె నామ జపంచేస్తూ నిన్ను ఆశీర్వదించగలను. గాని- నీకు ఇందుకు ప్రతిగా నేనేమివ్వగలను ? మీ అమ్మాజీని కాలేనుకదా.

సింధూబాయి చనిపోయిందని ఆమె నీకు దూరమైందనీ దిగులుపడకు. మానవజీవితాలకు ఆమె దివ్యౌషధంలా తులసిమొక్కై కోటలో నిలిచింది. దాని

విత్తనాలు మళ్ళీ మొక్కలుగా మొలుస్తాయి. ఔన్నత్యానికీ మంచితనానికీ నశింపు లేదు" అంటూ అతడి తలమీద చెయ్యివేసి నిమిరింది.

అమృతాన్ని తలపించే ఆ మాటలకోసం జీవన్‌లాల్ ప్రతిరోజూ ఆమె యింటికివెళ్ళి అమ్మాజీ అని పిలుస్తాడు. నోరారా పిలిచి సంతృప్తి చెందుతాడు. తామరాకులో ముడిచిపెట్టిన తులసిదళాలు ఆమె ముందుంచుతూ పాదాలను కళ్ళ కద్దుకుంటాడు.

---